క్లుప్తంగా

1,750 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు మంజూరు

బనగానపల్లె: మండలానికి 1750 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. క్వింటా రూ.9,400 నిర్ణయించగా 25శాతం రాయితీ పోను రూ.7,050తో రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ఎకరానికి 50 కిలోల చొప్పున ఐదు ఎకరాలకు మించకుండా విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు. అవసరం ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరో 450 క్వింటాళ్లు మంజూరు చేయాల్సిందిగా జిల్లా అధికారులను కోరినట్లు చెప్పారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ప్యాపిలి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ మధుసూదన్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో ఘర్షణలు జరగకుండా పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. ఇదివరకే రౌడీషీటర్లుగా ఉన్నవారు ప్రవర్తన మార్చుకోకుంటే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగే వారిపై రౌడీషీటర్ నుంచి పేర్లు తొలగిస్తామన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా

కోవెలకుంట్ల: రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు పోలీ సులు భావిస్తే వారిపై షీట్లు ఎత్తివేస్తామని పేర్కొన్నారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

సంజామల: మొక్కజొన్నకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు కోరారు. ఆల్వకొండ మొక్కజొన్న రైతులతో సీపీఐ నాయకులు ఆదివారం ముఖాముఖి నిర్వహించారు. నెల క్రితం మొక్కజొన్న క్వింటా రూ.2,950 పలికేదని..ప్రస్తుతం దళారులు ఏకమై రూ.2,350 అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. సీపీఐ నాయకులు సోమప్ప, రాధక్రిష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. మహిళకు గాయాలు

బేతంచెర్ల: ఆటోను లారీ ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని గోర్లగుట్ట మలుపులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు..బనగానపల్లె పట్టణం ఈద్గానగర్‌కు చెందిన నల్లబోతుల హుసేనమ్మ కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో బేతంచెర్ల నుంచి బనగానపల్లెకు వెళుతోంది. గోర్లగుట్ట మలుపులో బేతంచెర్ల వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నల్ల బోతుల హుసేనమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అంబులెన్స్‌లో శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

రంగస్వామికి వెండి దీప స్తంభాలు కానుక



దీపస్తంభాలు అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: గూటుపల్లెలో వెలసిన పాలుట్ల రంగస్వామికి హెచ్.కొట్టాల గ్రామానికి చెందిన భక్తులు పువ్వాడ రామకృష్ణ, రమాదేవి, రామానంద చౌదరి, దివ్యభారతి దంపతులు రూ. 18 వేల విలువైన వెండి దీప స్తంభాలను ఆలయ అర్చకుడు విష్ణువర్ధన్‌కు అందజేశారు.

సెలవుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

కొలిమిగుండ్ల: దసరా పండుగ సెలవుల కారణంగా ప్రయాణాలు చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. విలువైన వస్తువులు, నగదు, బంగారు ఆభరణాలను అవసరమైనంత మేరకు మాత్రమే ఇంట్లో ఉంచుకోవాలన్నారు. మిగిలిన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. ఊర్లకు వెళ్లాలనుకుంటే నమ్మకమైన వారికి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళితే నైట్‌బీట్ సిబ్బందితో ఆ ప్రదేశంలో గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇళ్లకు నలువైపులా సీసీ కెమెరాలు అమర్చుకుని డీవీఆర్‌ని రహస్య ప్రదేశాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు.

సచివాలయాలు.. సేవలు నిర్వీర్యం

- తెరుచుకోని వెబ్‌సైట్‌లు
- ఖాళీగా సచివాలయ ఉద్యోగులు

కొలిమిగుండ్ల: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకొచ్చి ప్రజల ఆకాంక్షను నెరవేర్చారు. ఊర్లోనే సత్వరమే సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ సేవలు నిర్వీర్యమయ్యాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వ వెబ్‌సైట్ ఓపెన్ కావడంలేదు. కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. సచివాలయాల్లో సేవలు లేక ఉద్యోగులు సైతం పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.40 లక్షలు ఖర్చు చేసి రెండు వేలు జనాభా ఉన్న గ్రామాల్లో సచివాలయాలు నిర్మించారు. గత ఐదేళ్ల పాటు ప్రభుత్వం అమలు చేసిన వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో లబ్ధిదారులతో సచివాలయాల్లో సందడిగా కనిపించేది. పలు రకాల సేవలను తక్కువ సమయంలోనే పొందేవారు. బనగానపల్లె నియోజకవర్గంలో 82 గ్రామ సచివాలయాలు ఉండగా 720 మందికి పైగానే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.



కొలిమిగుండ్లలోని గ్రామ సచివాలయం

పింఛన్ల పంపిణీ పేరుతో రోడ్డుపైకి..

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయాలు ఎందుకు?అవి అసలు ఉద్యోగాలే కాదంటు అవహేళన చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ ఉద్యోగులతో ఒకటో తేదీనే 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం వెనుక సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకం అనేది జగమెరిగిన సత్యం. ప్రభుత్వ ఉద్యోగాలు పొంది ప్రజలకు సేవలు అందించాల్సిన సచివాలయ ఉద్యోగులను పింఛన్ల పంపిణీ పేరుతో కూటమి ప్రభుత్వం నెలనెలా రోడ్లపైకి పంపి అవమాన పరుస్తోంది. సచివాలయాల్లో సేవలను ప్రభుత్వం పూర్తిగా కుదించింది. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించే పని అప్పగించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రభుత్వ శాఖలపై, క్షేత్ర స్థాయిలో ప్రజల స్థితిగతులపై అవగాహన కలిగిన సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలనే శాస్త్రబద్ధంగా ఆలోచించాల్సిన ప్రభుత్వం అదేమీ చేయకపోవకడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క పింఛన్, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డులు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఎలాంటి సేవలు లేకపోవడంతో ప్రజలు లేక వెలవెలబోతున్నాయి. గత ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన శాశ్వత భవనాలు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారనున్నాయి.

బనగానపల్లె నియోజవర్గంలో గ్రామ సచివాలయాలు

మండలం	సచివాలయాల సంఖ్య
కొలిమిగుండ్ల	16
అవుకు	18
కోవెలకుంట్ల	12
సంజామల	11
బనగానపల్లె	25

పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేయాలి

కోవెలకుంట్ల: ప్రభుత్వ పాఠశాలలకు నిర్వహణ గ్రాంటు విడుదల చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం కోరారు. ఆదివారం కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్ నెలలో విద్యా సంవత్సరం ప్రారంభమైందన్నారు. గత విద్యా సంవత్సరంతోపాటు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు పాఠశాల నిర్వహణ నిధులు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాక్‌ఫీస్‌లు, పారకలు, కరెంట్ బిల్లులు, చిన్నచిన్న మరమ్మతులు, తదితర మౌలిక వసతులకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలే భరిస్తున్నారని తెలిపారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిర్వహణ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

డోన్ టౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతుని కుటుంబానికి ఎన్‌హెచ్ అధికారులు మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. నేషనల్ హైవే పెట్రోలింగ్ వాహనంలో విధులు నిర్వహించే రేపల్లే రాముడు కొద్ది రోజుల క్రితం ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామం వద్ద విధి నిర్వాహణలో ఉండగా లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి నేషనల్ హైవే అధికారులు రూ.10 లక్షలు మంజూరు చేశారు.



బనగానపల్లె: కూష్మాండదేవి అలంకారంలో చౌడేశ్వరిదేవి



కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో లలితా త్రిపుర సుందరేశ్వరిదేవిగా..



అవుకు: అమ్మవారిశాలలో అర్ధనారీశ్వరీదేవి

మాతా నమోస్తుతే



కోవెలకుంట్ల: వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో నవదుర్గ వేషధారణలో బాలికలు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నాలుగో రోజు ఆదివారం డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు అభయమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బనగానపల్లెలో చౌడేశ్వరిదేవి అమ్మవారు కూష్మాండ అలంకరణలో, బేతంచెర్ల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహాలక్ష్మి అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



డోన్: అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవిగా..



బేతంచెర్ల: అన్నపూర్ణగా మహాలక్ష్మి



ప్యాపిలి: గాయత్రీదేవిగా వాసవీమాత

వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

- సూపర్‌సిక్స్ పథకాలేవి
- ప్రజల దృష్టి మళ్లించేందుకే తిరుమల లడ్డూపై అసత్య ప్రచారం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం మూడు నెలల్లోనే ప్రజా వ్యతిరేకత మూట కట్టుకుందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని శివకాశి ఫంక్షన్‌హాలులో ఓ శుభకార్యానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పరిపాలనలో అన్ని విధాలా విఫలమైందన్నారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఏటా ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున అందజేస్తామని, అన్నదాత సుఖీభవ పథకంతో ఏటా రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని హామీలు గుప్పించారన్నారు. మహిళలకు ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి కింద యువకులకు ప్రతి నెలా రూ. 3 వేలు ఇస్తామని హామీలిచ్చి తుంగలో తొక్కారని మండిపడ్డారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని అసత్య ఆరోపణలు చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై దేశ అత్యున్నత న్యాయస్థానం కొరడా ఝుళిపించిందన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారంటూ రాష్ట్ర ప్రభుత్వం దుష్ప్రచారం చేయడంతో ఈ వ్యవహారంపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సుప్రీంకోర్టు సీబీఐ డైరెక్టర్‌తో సిట్ విచారణకు ఆదేశించి సీఎంకు మొట్టికాయలు వేసిందని పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే చంద్రబాబు తిరుమల లడ్డూపై అసత్య ఆరోపణలు చేశారని, వంద రోజుల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పకుండా ప్రజలను దారి మళ్లించేందుకు స్వామిని వాడుకోవడం దుర్మార్గమన్నారు. ఉచిత ఇసుక పేరుతో పేదలకు ఇసుక అందకుండా కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, వెలగటూరు, జోళదరాశి, సౌదరదిన్నె సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, ఈర్నపాటి నాగేంద్ర, మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, ఈర్నపాటి సుబ్బరాయుడు, రామసుబ్బారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, మాచిరెడ్డి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శనగల వ్యాపారులపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: రైతుల నుంచి శనగలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన నలుగురు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని యర్రగుడి గ్రామానికి చెందిన 20 మంది రైతులు పండించిన శనగలను వైఎస్సార్ జిల్లా రాజుపాలెం మండలం సోమాపురానికి చెందిన వ్యాపారులు నడిపి సుబ్బరాయుడు, అతని కుమారులు సునీల్‌కుమార్, సురేంద్రతో పాటు గంగయ్యలకు విక్రయించారు. శనగలకు చెందిన రూ.56.48 లక్షలను ఇంత వరకు ఇవ్వకుండా మోసం చేశారు. రైతు కొప్పెర్ల కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్లలో ఉన్న గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వెల్లడించారు.

బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

డోన్ టౌన్: డోన్ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం మాజీ అధ్యక్షురాలు కస్తూరి కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆమె ఇంట్లో బ్రాహ్మణ సంఘ సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా కొత్తబుగ్గ రామలింగేశ్వస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మామిళ్లపల్లి ప్రహ్లాదశర్మ,ఉపాధ్యక్షుడిగా కళ్లె లక్ష్మీనారాయణశర్మ, కార్యదర్శిగా రాఘవేంద్ర స్వరూప్‌తో పాటు కమిటీ సభ్యులుగా సంజీవ్‌కుమార్‌శర్మ, పుల్లయ్యశర్మ, సుబ్రమణ్యంశర్మ,మధుశాస్త్రీ, కేశవరామారావు, సుగుణకరరావు,గీతాశర్మ, గౌరీశర్మ, సౌభాగ్య శర్మ ,నరసింహాశర్మలను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

రెడ్లు ఐకమత్యం కావాలి



సమావేశమైన రెడ్డి సంఘం నాయకులు

డోన్ టౌన్: రెడ్లు రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంగా ఉంటూ పేద రెడ్లను ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక నందురెడ్డి ఇంట్లో సంఘ సమావేశం నిర్వహించారు. కార్తీక వన భోజన మహోత్సవాలపై చర్చించారు. పలువురు మాట్లాడుతూ.. కొందరు రెడ్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిపారు.అలాంటి వారికి చేయూతనందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సంఘం నాయకులు హేమసుందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతుల ప్రదానం

కోవెలకుంట్ల: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కోవెలకుంట్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. భగవద్గీతలోని మొదటి అధ్యాయం 20 శ్లోకాలపై జరిపిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన సూర్యధరణి మొదటి బహుమతిగా రూ. 2,500, బనగానపల్లె మండలం పెండేకంటి పబ్లిక్ స్కూల్‌కు చెందిన చతుర ద్వితీయ బహుమతిగా రూ. 2వేలు, బేతంచెర్లకు చెందిన గీతిక మూడో స్థానంలో రూ. 1500 కైవసం చేసుకున్నారు. బహుమతులను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, కర్నాటి అభిలాష్ అందజేశారు. సంఘం నాయకులు నాగరాజు, సనత్‌కుమార్, కార్తీక్‌కుమార్, సందీప్, వెంకటసుబ్బయ్య, రాఘవాచారి, మునిస్వామి పాల్గొన్నారు.

మద్యం షాపులకు టెండర్ల ఆహ్వానం



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి

ప్యాపిలి/బేతంచెర్ల: మద్యం షాపులు ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి ప్రభుత్వం టెండర్లను ఆహ్వానిస్తోందని డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. డోన్‌లో 6, బేతంచెర్ల– 7, ప్యాపిలిలో 3 మద్యం దుకాణాలు కేటాయించినట్లు చెప్పారు. మద్యం షాపునకు లైసెన్సు ఫీజుగా బేతంచెర్లలో రూ.55 లక్షలు, ప్యాపిలిలోని దుకాణాలకు రూ. 65 లక్షలను ఆరు విడతల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 9వ తేదీలోగా అప్లికేషన్ ఫీజు రూ. 2 లక్షలు చెల్లించి ఆన్‌లైన్‌లో మద్యం షాపునకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటలకు నంద్యాలలో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా షాపుల కేటాయింపు ఉంటుందన్నారు.

బనగానపల్లె పరిధిలో 17 దరఖాస్తులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఎక్సైజ్‌శాఖ పరిధిలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు ఇప్పటి వరకు 17 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వర్ధనదేవి తెలిపారు. బనగానపల్లెలో 7, అవుకు–2, కొలిమిగుండ్లలో మూడు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని చెప్పారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బేతంచెర్ల: పట్టణంలోని భాగ్యోదయ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పెద్ద కాశయ్య, చిన్న కాశయ్య, దానమయ్య, శ్రీనివాసులు, లక్ష్మయ్య, రసూల్‌ను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు రిజ్వాన్, లోకేష్ గౌడ్, మురళీ, రాంబాబు, ప్రదీప్, రవి, శివ శంకర్‌రెడ్డి, సుధాకర్, ఉషా పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నకు నివాళి



నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం నేతలు

డోన్ టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డోన్ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వడ్డె ఓబన్న వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన అనుచరుడిగా వడ్డె ఓబన్న బ్రిటీష్ పాలకులతో పోరాటాం చేసి అమరుడయ్యాడని తెలిపారు. క్వారీల్లో వడ్డెర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు రంగస్వామి, ఎల్లస్వామి, లక్ష్మీ నారాయణ, గోవిందు, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

డోన్ రూరల్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ ఆదివారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక వ్యక్తి ఎన్ని మద్యం దుకాణాలకైనా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందు కోసం రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తామన్నారు.





కోవెలకుంట్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది, వల్లంపాడులో కప్పలవాగు

ఉప్పొంగిన వాగులు

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మూడు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం దొర్నిపాడు మండలంలో 38.8 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 23.4 మి.మీ, ఉయ్యాలవాడలో 2 మి.మీ, సంజామలలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. సబ్ డివిజన్‌తోపాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు కోవెలకుంట్ల– లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో పలువాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని వల్లంపాడు సమీపంలో కప్పల వాగు, చిన్నకొప్పెర్ల సమీపంలోని నల్లవాగులపై లోలెవల్ వంతెనలపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ రహదారిలో రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణ శివారులోని కుందూనదికి వరద నీరు పోటెత్తింది. భారీ వర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లో మొక్కజొన్న, పత్తి, మినుము, జొన్న, పొగాకు పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.